

పోల్కంపల్లి శాంతాదేవి

# తామరాకు

“ ‘చనిపోయి పెళ్ళిచేసుకున్న ప్రేమికులు!’ అదే! చచ్చిపోయి పెళ్ళెట్లా చేసుకుంటారు?” బోలెడు ఆశ్చర్యంతో పత్రికలో వార్త చదవసాగింది వినోదిని.

విమల్ ఆమె చదివే వార్తను ఆసక్తిగా వింటున్నాడు!

“ ‘రతన్, జ్యోతి పక్క పక్క ఇళ్ళవాళ్ళు! ఇద్దరూ గాఢంగా ప్రేమించుకొన్నారు! ఇద్దరిదీ ఒకే కులం కాకపోవడంవల్ల ఇరువైపు పెద్దలు వాళ్ళ పెళ్ళికి అంగీకరించలేదు! విరక్తిచెందిన ప్రేమికులిద్దరు చెట్టాపట్టాలు వేసుకొని మేడమీదనుండి క్రిందికిదూకి ఆత్మహత్య చేసుకొన్నారు. పిల్లలిద్దరూ చచ్చిపోయాక పెద్దవాళ్ళకు జ్ఞానోదయమైంది! మేళతాళాలతో, అన్ని లాంఛనాలతో శవా

లకు పెళ్ళిచేశారు. పెళ్ళితంతు పూర్తి అయ్యాక, ఇద్దరినీ ఊరేగించి, శవ సంస్కారం జరిపించారు!' " వార్త పూర్తి చేసిన వినోదిని ముఖంలో ఉద్విగ్నత చోటుచేసుకొంది. "విమూ! చివరికి మనమూ ఇలాగే చేయాలేమో!" అంది విషాదంగా.

"చచ్చిపోయి సాధించే దేమిటి!" విమల్ నిస్పృహగా అన్నాడు.

"మన పెళ్ళికి మీ నాన్న, మా నాన్న ఒప్పుకుంటారన్న ఆశ లేదు! నువ్వు లేని జీవితం నే నూహించుకోలేను!"

"ఉండక ఎక్కడికి వెడతాను? మీ పక్కింట్లోనేగా నే నుంట!"

"నువ్వుంటావు! నేను మాత్రం ఉండను!" కొంచెం కోపంగా అంది వినోదిని.

"ఎక్కడికి వెడతావు?" అతడు ఆశ్చర్యంగా అడిగాడు.

"అత్తవారింటికి !"

"ఏమిటి హాస్యం? పెళ్ళి కాకుండానే అత్తవారింటికి ఎలా వెడతావు?"

"పెళ్ళయ్యాకే వెడతాను! ఈ మాఘ మాసంలో నా పెళ్ళి చేసేయాలని మావాళ్లు పట్టుదలగా సంబంధాలు చూస్తున్నారు! నాకు పెళ్ళయితే అత్తవారింటికి వెళ్ళాల్సిందేగా?"

విమల్ ముఖంలో దిగులు చోటుచేసుకొంది. "నువ్వు అత్తవారింటికి వెడతావా? ఉహుఁ. అది జరగకముందే నేను ఆత్మహత్య చేసుకు చచ్చిపోతాను!" అన్నాడు ఉద్విగ్నంగా.

"చచ్చి ఏం సాధిస్తావు?" అతడు ఇంతకుముందు అన్న మాటను అతడికే అప్పగిస్తున్నట్టుగా అంది.

"మనసారా ప్రేమించి నమ్మాయి పెళ్ళిచేసుకొని అత్తవారింటికి వెడితే, రోజు కొక్కసారైనా నువ్వు నాకు కనిపించవనుకొంటే నాకు ఈ క్షణమే తల నేలకేసికొట్టుకు చావాలనిపిస్తుంది!"

"విమ్మూ, నేను పెళ్ళిచేసుకొని అత్త వారింటికి వెళ్ళిపోతా ననుకుంటున్నావా?"

"మీవాళ్ళు బలవంత పెడితే?"

"ఉహుఁ. నీకు కాక మరొకరికి భార్యనుకాను! నిన్ను విడిచి నేను అత్తవారింటికి వెళ్ళను! నీమీద నాకున్న ప్రేమ అంత బూటకమైందనుకొన్నావా? నువ్వు అలాంటి దిగులేం పెట్టుకోవద్దుగాని మన పెళ్ళి జరిగేట్టు చూడు! ఎలాగైనా మీ నాన్నని ఒప్పించడానికి ప్రయత్నం చెయ్యి!"

"ఉహుఁ. ఒప్పుకొంటాడన్న ఆశ లేదు, వినూ! పెళ్ళి సంగతి మళ్ళీ ఎత్తావో తుపాకీ పెట్టి కాల్చేస్తానన్నాడు మానాన్న!"

వినోదిని ముఖంలో నీలిమబ్బులు తారట్లాడాయి! విమల్ చెయి గట్టిగా వడిసి పట్టుకొని, అంది రుద్ధస్వరంతో "చచ్చి పోవడానికి నీకు ధైర్యం లేదేమోగాని నాకుంది, విమూ! నువ్వులేని జీవితం నాకొద్దు!"

"నువ్వు లేని జీవితం నాకు మాత్రం ఎందుకు? నువ్వులేని జీవితానికి నేనూ సంతోషంగా గుడ్‌బై చెబుతాను! ఇద్దరం కలిసే చచ్చిపోదాం. ఈ రతన్, జ్యోతి స్థానే మన పేర్లూ ఒకనాడు ఈ పేపరులో వస్తాయి! కాని, మన పెద్దవాళ్ళు మన శవాలకికూడా పెళ్ళిచేయడానికి ఒప్పుకోరు సుమా!"

"శవాలకి పెళ్ళెందుకు? ఏం చేసుకోను?" విరక్తిగా అంది వినోదిని. "ఇక జరగాల్సింది చెప్పు, విమూ!"

"నువ్వు చెప్పు! నువ్వు చెప్పినట్టు నేను చేస్తాను! అదే, నిన్ను నేను ఎంత గాఢంగా ప్రేమిస్తున్నానో దానికి గుర్తు!"

"ఒకసారి మీ నాన్నని కదిపిచూడు! ఒప్పుకోకపోతే కులం అని, డబ్బున్న వాళ్ళనీ లేనివాళ్ళనీ విభజించిన ఈ కుళ్ళు ప్రపంచానికి గుడ్‌బై చెప్పేద్దాం!"

"ఓ. కె"

విమల్, వినోదిని పక్క పక్క ఇళ్ళవాళ్ళు! చిన్నప్పటినుండి ఆడుతూ పాడుతూ పెరిగారని చెప్పడానికి వీల్లేదు. 'ఆడపిల్ల మగాళ్ళతో ఆడొచ్చా?' అని వినోదిని తల్లి మగపిల్లలతో ఆడనిచ్చేది కాదు! విమల్ కూడా అంతే! ఆడపిల్లలతో ఆడడం చిన్నతనమనుకొనేవాడు. యవ్వనంలోకి అడుగుపెట్టాకే మధనుడి ఆటలో పావుల్లా ఆకర్షణలో పడ్డారు! ప్రేమించుకొన్నారు! పెళ్ళి చేసుకుందామనికూడా అనుకొన్నారు! కాని, పెద్ద వాళ్ళతో చిక్కొచ్చిపడింది. విమల్‌తండ్రి గొప్పశ్రీమంతుడు. సాదామనుషులెవరూ అతడి కంటికానరు! సాదామనుషులతో అసలు పరిచయం పెట్టుకోడు! డబ్బులేని వాళ్ళంటే అతడికి చెప్పలేనంతఅసహ్యం, చులకన.

వినోదిని తండ్రి నిరుపేద! కాని, పరమ నైష్ఠికుడు. తన కులస్తులని, అంటే బ్రాహ్మలని తప్ప ఇంకెవరినీ గౌరవించలేని వ్యక్తి. బ్రాహ్మణేతరులకు అతడు చాలా దూరంగా, మడికట్టుకొన్నట్టుగా మసలుతుంటాడు. కూతురు కులంకాని వాణ్ణి ప్రేమించిదని చూచాయగా తెలిసినప్పుడే పిల్లను చంపినంత పనిచేశాడు! నిప్పులుతొక్కిన కోతిలా గంతులు వేశాడు.

"వాడిని ప్రేమించడం కాదు! ఈసారి వాడికేసి కన్నెత్తి చూశావో నేను పూజ చేసే దుర్గముందు నిన్ను పడేసి గొడ్డలితో నరుకుతాను!" అని ఖండితంగా చెప్పేశాడు.

అటు విమల్ పరిస్థితి అలాగే ఉంది!

"పెళ్ళిళ్ళ మార్కెట్‌లో లక్ష ఏభై వేల ధర ఉందిరా నీకు! కానీ ఠికాణాలేని వాడి పిల్లను ప్రేమించి అంత డబ్బు గంగలో కలుపుతావా? ఆ కౌపీనధారి నా వియ్యంకుడా? జాగ్రత్త! ప్రేమాగీమా అని పిచ్చిపిచ్చి వేషాలు వేశావో గన్‌తో షూట్‌చేసి పడేస్తాను!" గర్జించి మరీ చెప్పాడు విమలతండ్రి.

ఇద్దరు కలుసుకోడానికీ, మాట్లాడుకోడానికి ఇంటిదగ్గర అసలు వీలుచిక్కదు విమల్ వినోదినులకు। వినోదిని స్నేహితురాలింట్లో అప్పుడప్పుడూ కలుసుకుంటుంటారు। కాని, కలుసుకొన్న ప్రతిసారీ పెద్దవాళ్ళకు తెలిసిపోతుందేమోనని భయం।

* * *

పదిహేను రోజుల తరువాత మళ్ళీ అక్కడే కలుసుకొన్నారు.

"లాభంలేదు, మా నాన్న ఎంత మాత్రం ఒప్పుకోవడంలేదు మన పెళ్ళికి। మనకిక ఆత్మాహుతే శరణ్యం।" నిరాశగా అన్నాడు విమల్.

"అంతేనా?" క్రుంగిపోయినట్టుగా అంది వినోదిని. "విమూ। మనం ఎక్కడికైనా పారిపోయి పెళ్ళిచేసుకొందాం?"

"అది ఏం లాభంలేదు। మా నాన్న ముల్లోకాలు గాలించి అయినా నన్ను పట్టుకు కాల్చేస్తాడు।"

ఎన్ని విధాలుగా ఆలోచించినా తమకు పెళ్ళి అవుతుందన్న ఆశ కనిపించలేదు. ఆత్మాహుతి తప్పదన్న నిర్ణయానికి వచ్చాక, అది ఏ రూపంలో ఉంటే బాగుంటుందన్న దానిమీద తర్జనభర్జన పడ్డారు. ఏ చార్మినార్ లాంటి ఎత్తు కట్టడం మీద నుండో క్రిందికి దూకేస్తే బాగుంటుందా? మూసీలాంటి ఏ ప్రవాహంలోనో పడి చస్తే బాగుంటుందా? ఏ విషమో, నిద్ర మాత్రలో మింగేసి చస్తే బాగుంటుందా? చావు ఏ రూపంగావస్తే తమకి సుఖంగా ఉంటుందన్న దానికంటే, తమ శవాలు ఏ రూపంగా దొరికితే తమ పెద్దవాళ్ళకి పశ్చాత్తాపం ఎక్కువగా కలిగిస్తాయన్న దానిమీదే ఎక్కువగా ఆలోచించారు. తమ పెళ్ళికి అంగీకరించని పెద్దవాళ్ళ మీదే కాదు, కులమని, కలవాళ్ళనీ లేనివాళ్ళనీ తమని విడదీస్తున్న సమాజంమీద ఏమిటో కసిగా, పగ సాధిస్తున్నట్టుగా ఉంది.

చనిపోవడానికి ముందు ఏం చేస్తే బాగుంటుంది? ఏ ఊటీలాంటి ప్రదేశానికో వెళ్ళిపోయి, హాయిగా రెండుమూడు రోజులు గడిపి ఆ తరువాత ఈ లోకానికి గుడ్‌బై చెప్పితే? ఇది విమల్ ఆలోచన.

"అమ్మో, వద్దు। నాకలా ఇష్టంలేదు। మన ప్రేమ పవిత్రప్రేమ కావాలి। కామ వాంఛతో దాన్ని మలినపరచడం నాకిష్టం లేదు।" స్త్రీ సహజమైన భయంతో పవిత్ర ప్రేమను చాటుచేసుకొంది వినోదిని.

"నూరేళ్ళ జీవితాన్ని అంతంచేసుకుంటున్నాంకదా? చావుకిముందు కొంచెం ఎంజాయ్ చేసుకొందామని। నువ్వొద్దంటే వద్దులే। మరింకేమిటి చేద్దాం, చెప్పు।"

"ఇద్దరంకలిసి ఓ ఫోటో దిగొద్దాం। మనం చచ్చాక మన ఫోటోని పేపర్లో వేస్తారు। ఆ ఫోటోని పేపర్లో వేసేట్టు మనం ఉత్తరాలు రాసిపెడదాము।"

చివరికి,

చనిపోడానికి ముందు ఇద్దరూ కలిసి ఒక ఫోటో తీయించుకోడానికి, రాత్రో

పగలో ఏదో ఒక సమయం చూసుకొని, నాలుగంతస్తులుగా ఉన్న విమల్ మేడ మీదినుండీ క్రిందికి దూకేయాలని నిర్ణయానికి వచ్చాక, ఇద్దరూ విషాదంగా వీడ్కోలు తీసుకొన్నారు!

రెండురోజులు గడిచాక ఒకరోజు ఉదయం పదిగంటలప్పుడు విమల్ వినోదినివాళ్ళింటికి వచ్చాడు. చిన్నతనంలో ఎప్పుడైనా వచ్చాడో లేదోగాని బుద్ధితెలిశాక అతడెప్పుడూ పక్కింటి ఛాయలకు కూడా రాలేదు! ఈ రోజు వచ్చాడు.

వినోదిని తండ్రి సుబ్రమణ్యశాస్త్రి బాయటివ్యవహారాలు ముగించుకొనివచ్చి స్నానంచేసి సంధ్య వార్చబోతున్నాడు.

విమల్‌ని ఆయన ప్రశ్నార్థకంగా చూసేలోపల "వినోదిని ఎక్కడ?" అని అడిగాడు విమల్.

"దానితో నీకేం పని?" శాస్త్రి కోపంగా అడిగాడు.

"ముందు పిలవండి!" విమల్ నిర్భయంగా అంటున్న తీరుకు అరికాలిమంట నెత్తికెక్కినట్టు అయింది శాస్త్రికి.

"దాన్ని పిలవడం కాదు! ముందు నువ్వు బయటికి నడిచి మాట్లాడు!"

ఆయన గొంతు గట్టిగా, అరిచినట్టుగా వినిపించి, వినోదిని బయటికి వచ్చింది. ఎప్పుడూ తనింటికి రానివాడు వచ్చాడేమిటాని విస్మయంగా చూడసాగింది.

"రా!" అంటూ హఠాత్తుగా ఆమె చెయ్యి పట్టుకొన్నాడు విమల్. "నీ అభిప్రాయం మార్చుకోలేదు కదా?"

వినోదిని నిటారుగా అయి, "అభిప్రాయం ఎందుకు మార్చుకుంటాను?" అంది.

"అయితే పద! డాడీ ఊళ్లో లేరు! అమ్మా, చెల్లెళ్ళు ఏదో ఫంక్షనుకు ఎవరింటికో వెళ్లారు ఇప్పుడు మనపని చాలా సులువుగా, ఏ అడ్డంకులూ లేకుండా అయిపోతుంది!"

'ఇప్పుడా? ఇంత తొందరగానా?' అనలేదు వినోదిని. ప్రాణత్యాగానికి తను ఏ క్షణంలోనైనా సిద్ధమేనన్నట్లు, పని చేస్తూ నడుములో దోపిన కుచ్చిళ్ళుకూడా తీయకుండా అతడివెంట నిర్భయంగా కదిలింది.

"ఎక్కడికి మీరిద్దరూ? నాకళ్ళముందే లేచిపోవడానికి ఎంత ధైర్యం మీకు?" రంకెలేస్తూ వెంటబడ్డాడు శాస్త్రి.

"మీరు మా వెంట రావొద్దు! మమ్మల్ని ఆపవద్దు! మీ కులాభిమానానికీ, మా నాన్న డబ్బు దాహానికీ మా చిన్ని జీవితాలు బలిఅవుతున్నాయి! బ్రతికుండి మేం ఎడబాటు సహించలేం! అందుకే మీనుండి, ఈ కుళ్ళు ప్రపంచంనుండి సెలవు తీసుకొంటున్నాం!" వినోదిని చెయిపట్టుకొని, తూనీగలా ఒక్కో అంతస్తు దాటుతూ పైభాగం చేరుకొనేలోపల పెద్దగా అరిచి చెప్పాడు విమల్.

అదేదో సినిమాలో దృశ్యంలా ఉంది!

విమల్ ఇంట్లో నౌకర్లూ, శాస్త్రిగారు

షాక్‌నుండి తేరుకొని అక్కడికి చేరుకొనే సరికి అయిపోయింది.

వినోదిని చెయ్యి అతడిభుజాన్ని గుచ్చి పట్టుకొంది। విమల్‌చెయ్యి ఆమె నడుం చుట్టూ పెనవేసుకొంది। ఇద్దరూ ఒకేసారి క్రిదికి దూకేశారు, నాలుగో అంతస్తు పైభాగంనుండి।

* * *

హైదరాబాద్, మే 11– వినోదిని, విమల్ ఇద్దరూ పక్కపక్క ఇళ్ళవాళ్లు; ఇద్దరూ గాఢంగా ప్రేమించుకొన్నారు. ప్రేమికులకు ఎప్పుడూ అడ్డుపడే కులం, డబ్బు వీళ్ళ పెళ్ళికీ అడ్డుపడ్డాయి। విఫల ప్రణయంతో, విరక్తితో ఈ లోకానికి గుడ్‌బై చెప్పాలనుకొన్నారు। నాలుగు అంతస్తులున్న విమల్ మేడమీదినుండి ఇద్దరూ దూకేశారు. అ ప్రేమికుల దుర దృష్టమో, అదృష్టమో యమధర్మరాజు రోడ్డుమీద ప్రత్యక్షం కాలేదు। సరిగా, అప్పుడే గేదెలకు పచ్చిగడ్డి తీసుకువెడు తున్న లారీమీద పడ్డారు. స్వల్పంగా గాయాలు తగిలాయి. ప్రస్తుతం హాస్పి టల్లో కోలుకొంటున్నారు।

పత్రికలో ఈ వార్తతోపాటు విమల్, వినోదిని కలిసి తీయించుకొన్న ఫోటో కూడా వేశారు.

హాస్పిటల్ బెడ్‌మీదున్న వినోదిని ఆ వార్త చదివి పత్రిక మడిచి ప్రక్కన స్టూల్‌మీద పడేసి ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచింది. అమరప్రేమికులు కావలసింది పోయి అభాసుపాలైన ప్రేమికులయ్యారు కదూ?

ఈ రోజు పదిహేనో తారీకు. నాలుగు రోజులైంది ఆ సంఘటన జరిగి।

క్రిందికి దూకడమే తెలుసు వినోదినికి। ఒకరోజు గడిచాక గాని ఆమెకు స్పృహ రాలేదు। వచ్చాక ఆమెకళ్ళు విమల్‌కోసం చూశాయి.

అతడికి కొద్దిగా గాయాలు తగిలా యని, మంత్రులూ, కోటీశ్వరులూ చికిత్స పొందే ఖరీదైన నర్సింగ్‌హోమ్‌లో చేర్చ బడ్డాడనీ చెప్పారెవరో.


"కొద్దిగా గాయాలు అయినా అతడి కాళ్ళు, చేతులు సజావుగానే వున్నాయి; నీ కాలుమాత్రం తీసేయాలంటున్నారు డాక్టరుగారు. తీసేయకపోతే కాలంతా మురిగి ప్రాణానికే ముప్పువస్తుం దన్నారు।" అని చెప్పింది వినోదినిఅక్క.

ఆ మాట విని కెవ్వున కేకపెట్టింది వినోదిని. "వద్దు। నా కాలు తీసేయొద్దు। ఆ కుంటిబ్రతుకు నే నూహించలేను। కావాలంటే నా ప్రాణం తీసేయమను। సంతోషంగా ఒప్పుకొంటాను।"

"అవసరమైతే నీ శరీరంలో ఏ అవ యవమైనా తొలగించడానికి సిద్ధమేగాని ఏ పరిస్థితిలోనూ నీప్రాణం తీసేయ లేనమ్మా।" అన్నారు డాక్టరుగారు, వినోదిని బాధచూసి.

కొద్దిరోజులు గడిచాయి.

విమల్ నర్సింగ్‌హోం నుండి



డిశ్చార్జి అయ్యాక ఒకరోజు మాత్రం వినోదినిని చూడడానికి వచ్చాడు.

వినోదినిని చూస్తూనే అతడికళ్ళలో తళుక్కుమనే అనురాగం ఇవాళ మబ్బు కమ్మినట్టుగా అయింది! ముందు రెండు పళ్ళు ఊడిపోయి, ముఖమంతా గాయాల మచ్చలతో ఉన్న వినోదినిని చూస్తే అతడి కేమిటో కడుపులో త్రిప్పినట్లుగా అయింది!

విమల్ ఒంటిమీద ఒక్క గాయం గుర్తుకూడా లేదు! ఖరీదైన సూట్‌లో పూలరంగడిలా ఉన్న విమల్‌ని చూస్తే కొంచెం ఈర్ష్య అనిపించింది వినోదినికి.

కాంతిలేని అతడి చూపులు చూసి, "నా ముఖంచూస్తే అసహ్యం వేస్తుందా?" అంది నీరసంగా నవ్వి.

"........" నవ్వితే మల్లెలు విరిసి నట్టుగా, కురిపిస్తున్నట్టుగాఉండే వినోదిని నవ్వు ఇవాళ భయంకరంగా కనిపించింది విమల్‌కి. ముందు రెండు పండ్లు లేని తొర్రి, ఇక వినోదిని ఎప్పుడూ నవ్వకపోతే బాగుండే దనిపించింది.

"మాటలు కరువైనట్టుగా కూర్చు న్నావు! ఏం మాట్లాడా లనిపించడం లేదూ?"

"........"

మాట్లాడు, విమల్! నువ్వు హాస్పి టల్‌నుండి మూడురోజులకే డిశ్చార్జీ

అయ్యావని విని, నువ్వొస్తావని రోజూ నీకోసం ఎదురుచూస్తున్నాను! ఇప్పుడా నన్ను చూడడానికి రావడం?"

ఆ అమ్మాయి చనువుగా నిష్ఠూరమాడుతూంటే విమల కేమిటో ఒంటిమీద గొంగళిపురుగు ప్రాకినట్టుగా అనిపించింది. "నాకు ఇంట్లో ఇరవై నాలుగు గంటలు కాపలా! ఇవాళ అమ్మను బులిపించి బెలిపించి ఎలాగో బయటపడ్డాను."

"ఇంత జరిగినా మీ వాళ్ళలో మార్పు రాలేదన్నమాట!: మా అమ్మా నాన్నా ఎంత మారిపోయారో తెలుసా? 'పిచ్చి పిల్లవు! ప్రేమించినవాడికోసం నిండు జీవితం బలిచేసుకోవా లనుకొన్నావా? మా అదృష్టం బాగుండి నువ్వు ప్రాణాలతో ఇలా మా కళ్ళముందున్నావు! ఇక నీ ఇష్టం! అతడినే చేసుకో! నువ్వు బ్రతికుంటే చాలు! బిడ్డ ప్రాణంకంటే మాకు కులం, గౌరవం ఎక్కువ కాదు!' అని చెప్పేశారు తెలుసా?" ఉత్సాహంగా చెప్పింది వినోదిని.

విమల్ ముఖం మాత్రం విరియలేదు!

"ఇక నావైపు అడ్డంకి ఏంలేదు! ఇక నీదే! మీ వాళ్ళని ఇప్పుడుకూడా ఒప్పించలేవా?"

"నీ కాలికి బదులు నాకాలు విరగలేదుగా వాళ్ళలో మార్పు రావడానికి?" విమల్ పేలవంగా నవ్వాడు.

"నువ్వు మళ్ళీ ఆత్మహత్య తలపెట్టగలవని భయం ఏర్పడేట్టు చేస్తే?"

"మనిషికి చావు తెగింపు జీవితంలో ఒకే ఒకసారి వస్తుందేమో, వినోదినీ! ఆ ఆవేశం, ఆ తెగువ ఇప్పుడు నాలో లేవు! ప్రాణాలని తృణప్రాయంగా భావించిన ఆ విమల్‌ని నేనేనా అని అనిపిస్తోంది ఇప్పుడు!" అన్నాడు విమల్. 'నీకోసం ఏమైనా చేయగల విమల్ నా మొహంలో ఏర్పడిన అనాకారితనం చూసి ఎటో మరిపోయినట్టున్నాడు' అన్నమాట మాత్రం మనసులో అనుకొన్నాడు.

"డాక్టరుగారు నా కాలు తీసేయాలంటున్నారు! ధర్మాసుపత్రి ఇది! నేనా బీదవాడి కూతుర్ని! ఇక్కడి డాక్టర్లకి కాళ్ళు చేతులు నరికివేసేపని తేలిక! బాగుపరచడం వీళ్ళకి చేతకాదు! ఏ రాయవేలూరో వెడితే కాలు బాగవుతుందేమోగాని మా దగ్గర అంత డబ్బు లేదుగా?"

"పాకెట్ మనీక్రింద నాన్నగారిచ్చే డబ్బు ఓ నాలుగైదు వందలకంటే ఎక్కువుండదు నా దగ్గర!"

"డబ్బు నువ్వు సర్దాలనికాదు నా వుద్దేశం!" అభిమానంగా అంది వినోదిని.

"నీ కాలు విరిగింది నా కోసమే! కనీసం నీ కాలుకోసం డబ్బు సర్దగలిగితే నా మనసుకు తృప్తిగా ఉండేది! కాని, నేను అస్వతంత్రుడినీ అసమర్థుడినీ! నన్ను క్షమించు, వినోదినీ! నువ్వు నా వల్ల చాలా నష్టపోయావు!"

"మన మధ్య లాభనష్టాల బేరీజు ఏమిటి, విమూ?" నొచ్చుకొంది వినోదిని.

"ఒక్క ప్రాణంలా ప్రేమించుకొన్నాం. ఒక్కసారే ప్రాణాన్నికూడా వదిలేయా లనుకొన్నాం!"

"నే నిక వస్తాను!"

"అప్పుడేనా? కాస్సేపు కూర్చో! ను వ్వెంతసేపు కూర్చున్నా మావాళ్ళు ఏమీ అనుకోరు! వాళ్ళు పూర్తిగా మారిపోయా రని చెప్పాగా?"

ముళ్ళమీద కూర్చొన్నట్టుగా కూర్చు న్నాడు విమల్.

ఇదివరలో వినోదిని ముఖంలోకి ఎంతసేపు చూసినా తనివి తీరేదికాదు! ఇంద్రనీలాల్లా కనిపించే ఆమె కళ్ళలోకి చూస్తూ ఎన్ని యుగాలైనా గడిపేయవచ్చు ననిపించేది! ఇప్పుడు ఒక్కసారికళ్ళెత్తి ఆ ముఖంలోకి చూడాలంటే దుర్భరమని పిస్తూంది! ఎందుకిలా?

తనకోసమే అలా అయిపోయిన వినోదిని....తను ఇవాళ భరించలేకపోతు న్నాడని ఆ అమ్మాయికి తెలిస్తే!

"మళ్ళీవస్తాను, వినోదినీ! తొందరగా వస్తానని అమ్మకి మాటిచ్చి వచ్చాను!" అని లేచి వెళ్ళిపోయాడు విమల్.

* * *

వినోదినికి తప్పనిసరిగా కాలు తీసే యాల్సి వచ్చింది. కాలు తీసేశాకకూడా నెలరోజులపాటు హాస్పిటల్ బెడ్‌మీదే ఉండాల్సివచ్చింది.

తను గడపబోయే కుంటిజీవితం ఊహించుకొంటూంటే ఏదైనా తిని చచ్చి పోతే బాగుండే దనిపిస్తుంది వినోదినికి. ఒంటరిగా హాస్పిటల్ బెడ్‌మీద పడుకొని, భవిష్యత్తు గురించి ఆలోచనలు భయపెడు తూంటే, ప్రక్కన పలకరించడానికి, ధైర్యం చెప్పడానికి విమల్‌కూడా లేక అవి రెట్టింపు అవుతూంటే, వినోదినికి ఏదో నరకంలో ప్రొద్దుగ్రుంకినట్టుగా అనిపిస్తూంది!

విమల్ ఒకసారికూడా ఇటు తిరిగి చూడలేదు! వినోదిని చెల్లెలితో రెండు మూడుసార్లు కబురు చేసిందికూడా.

"అతను ఇంట్లోనే ఉండటం లేద క్కయ్యా! కోటీలో బట్టలషాపు చూసు కుంటున్నాడట! ఉదయం లేచి అక్క డికే వెడుతున్నాడు! ఎలాగో వీలుచూసు కొని నువ్వు పిలుస్తున్నావని చెప్పాను! 'తీరికైతే వస్తాను' అన్నాడు" అని చెప్పింది చెల్లెలు.

ఇంతవరకు తీరిక కాలేదు విమల్‌కి.

రోజులు గడిచిపొతున్నకొద్దీ, అతడికి ఇక ఎప్పుడూ తీరికకాదని గ్రహించింది వినోదిని.

ఈ కాలూ, ఈ పళ్ళూ తనకి విరిగే బదులు అతడికే విరిగితే?

ఇలా అతడిని తను వదిలివేసేదికాదు! అతడికి మరింత చేరువై అతడికి కలిగిన మనఃక్లేశాన్ని పోగొట్టడానికి ప్రయత్నిం చేది! అతడికి కలిగిన ఆ లోటు జీవితంలో అతడి నెప్పుడూ బాధించకుండా చూచు కొనేది!

ఆడ, మగ ఇద్దరు ప్రేమలో పడితే ఎప్పుడూ ఆడదే దగాపడుతుంది। ఆడదే నష్టపోతుంది। మగవాడెప్పుడూ తడితాకని తామరాకులా ఉంటాడు।

తన ప్రేమ ఉదంతం పేపర్లోకి ఎక్కి, ఇంత గొడవ జరిగాక ఇప్పుడు తనని ఎవరు పెళ్ళిచేసుకొంటారు? పైగా తనకి కుంటికాలు తొర్రినోరు, తన ప్రేమకథకిసాక్ష్యాలుగా।

* * *

అరునెలలు గడిచాయి।

ఒకరోజు విమల్ ఇంటిముందు పెళ్ళి పందిరి వెలిసింది। బాజాలు మ్రోగాయి।

పెళ్ళి విమల్ కే।

'అతిలోక సౌందర్యవతి' అనిపించ దగ్గ అమ్మాయి రెండులక్షల కట్నంతో అతడి జీవితంలో అర్ధాంగిగా అడుగు పెట్టింది।

కన్యాదాత గృహంనుండి ఆరోజే వధువును తీసుకొని వచ్చారు।

సత్యనారాయణ స్వామివారి వ్రతం, గ్రాండ్ గా రిసెప్షన్ ఏర్పాటయ్యాయి।

వధూవరు లిద్దరు షామియానా క్రింద కుర్చీల్లో కూర్చొని బహుమతులు స్వీక రిస్తున్నారు।

షామియానా చివర, దూరంగా తాడుకి ఆనుకొని, కళ్ళని నీటిపొర కమ్ముతుంటే చూస్తూంది వినోదిని।

విమల్ తల్లి చూసింది ఆ పిల్లని. నౌకరుకి ఏదో సైగచేసింది ।

నౌకరు కోపంగా వినోదిని దగ్గరికి వచ్చాడు.

"సిగ్గులేదూ ఇక్కడికి రావడానికి? తగుదునమ్మా అని వచ్చావా కుంటికాలు వేసుకొని? నడునడూ। నీ కథ పెళ్ళి వాళ్ళకి తెలిస్తే లేనిపోని గలాటా అవు తుంది।" చెయ్యి ఆ పిల్లభుజంమీద వేసి ఒక నెట్టు నెట్టాడు।

చంకలోంచి కర్ర జారిపోయింది. వినోదిని తూలిపడింది। ముఖం బోర్లా పడడంలో ముందుకట్టిన రెండుపళ్ళూ ఊడిపోయాయి। పెదవులు చిట్లి రక్తం కూడా వచ్చింది।

అందరి దృష్టి ఇటే కేంద్రీకృతమైంది। ఆసక్తిగా చూస్తున్నారు।

"ఎవరు? ఏం జరిగింది?" అందరూ అడుగుతున్నారు.

"ఎవరో తిక్కముండ।.... లేవవే।" నౌకరు ఈసడింపుగా ఆ పిల్లను కుదించి లేపి కర్ర చేతికిచ్చాడు. "నడూ ఇంక।"

విమల్ చూస్తున్నాడు। అతడి చూపుల్లో ఏదో కలవరం। ఏదో బాధ। కాని, ఏదో కనిపించని తాడు కట్టివేసినట్టుగా కుర్చీకి అతుక్కుపోయాడు।

భగ్గుమన్నట్టుగా అయింది వినోదినికి. చంకక్రింద కర్ర టకటకలాడిస్తూ చర చరా విమల్ దగ్గరికి వచ్చింది. విమల్ ముఖంలోకి నిశితంగా గ్రుచ్చిచూస్తూ "మన ప్రేమకు మన రెండు జీవితాలు బలిఇద్దామనుకొన్నాం। కాని, చిత్రంగా

నీ అదృష్టం నిన్నూ, నా దురదృష్టం నన్నూ బ్రతికించాయి. మనం బ్రతికాం. కాని, మన ప్రేమ నడ్డిట్లో ముక్కలైన పడవలా అయింది.

"శారీరకంగా నాకు ప్రాప్తించిన ఈ అనాకారితనంకంటే మానసికంగా నీకు ప్రాప్తించిన అనాకారితనం వందరెట్లు, వెయ్యిరెట్లు భయంకరమైనది. అసహ్యమైనది. ఎవరికీ కనిపించని నీ సుందర రూపం ఒకసారి నీ భార్య చూడనీ. చూసి ముగ్ధురాలవనీ. ఇదిగో, నీ పెళ్ళి సందర్భంగా నే నిస్తున్న కానుక. చరిత్రలో ఏ ప్రేయసీ తన ప్రియుడికి ఇలాంటి కానుక ఇవ్వాల్సిన అవసరం రాలేదనుకొంటాను." అని పిచ్చిదానిలా నవ్వసాగింది వినోదిని.

నవ్వుతూంటే ఆ అమ్మాయి తొర్రి నోరు మహా భయంకరంగా కనిపించింది అందరికీ.

జాకెట్‌లోంచి ఒక కటింగ్ మడత విమల్ చేతికిచ్చి వెళ్ళిపోయింది వినోదిని, ఇంకా పిచ్చిదానిలా నవ్వుతూనే.

ఆ కటింగ్ ఏదో కాదు.

వినోదిని విమల్ ఫోటోతో, వాళ్ళ ఆత్మహత్యా ప్రయత్నం వేసిన వార్త.

విమల్ జాగ్రత్తపడేలోగానే పెళ్ళి కూతురు ఆపుకోలేని కుతూహలంతో ఆ కాగితం లాక్కుంది. అది చదివిన ఆమె ముఖం తెల్లగా, పాలకంటే తెల్లగా పాలిపోయింది.

* *

రోజులు గడిచిపోతున్నాయి.

ప్రేమలో దగాపడ్డ వినోదిని రోజు రోజుకూ క్రుంగి క్రుశించిపోతూంది.

విమల్ మాత్రం పూలరంగడిలా ఉన్నాడు.

తన వైవాహిక జీవితం మూడు పువ్వులు ఆరుకాయలన్నట్టుగా పండించుకొంటున్నాడు.

మగవాడు ప్రేమలో పడ్డా, వ్యభిచరించినా భార్య సహితం చూసీ చూడనట్టుపోయే సమాజం మనది. పోతే, ఎన్ని పాపాలు చేసినా, ఎన్ని తప్పులు చేసినా నీరంటని తామరాకులా బ్రతకగల వరం ప్రకృతి అతడికిచ్చింది మరి.

అందుకే అతడి భార్య అతడి ప్రేమ కథను త్వరగానే మరిచిపోయింది.

ఎప్పుడైనా వినోదిని కనిపిస్తే ఆమె కళ్ళలో ఒక హేళనాభావం అలవోకగా కదులుతుంది.

వినోదిని గుండెలో మంటలు లేస్తాయప్పుడు !